క్యాలెండర్ల ఆవిష్కరణ

నేచర్ లైఫ్‌స్పేస్ ఆధ్వర్యంలో...



నేచర్ లైఫ్‌స్పేస్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను బుధవారం రవీంద్రభారతిలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. నేచర్ లైఫ్‌స్పేస్ చైర్మన్ అండ్ ఫౌండర్ రమేష్ మూడు, కో ఫౌండర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మేఘన రమేష్, ప్రెసిడెంట్ వినాయక్, నగేష్, రాజశేఖర్, రవీందర్, సుగుణ పాల్గొన్నారు.- (రాంనగర్, ఆంధ్రజ్యోతి)

పశు వైద్యులు అసోసియేషన్ ఆధ్వర్యంలో..



పశు వైద్యులు, ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన డైరీ, క్యాలెండర్‌ను బుధవా రం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మాన్యం రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి డా. గంధం నాగయ్య, అసోసియేట్ అధ్యక్షుడు డా.శ్రీధర్‌రెడ్డి, ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా. వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

(చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి)



టీఎస్‌టీయూ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, ప్రొ. కోదండరాం తదితరులు

నాణ్యమైన విద్యాబోధనకు పాటుపడాలి

● ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ (టీఎస్‌టీయూ) పాత్ర కీలకమైనదని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఎం.కోదండరాం అన్నారు. టీఎస్‌టీయూ రూపొందించిన 2025 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం టీజేఎస్ కార్యాలయంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కోదండరాం.. డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగం నూతన ఆవిష్కరణలు, అభివృద్ధిలో ప్రభుత్వ ఉపాధ్యాయుల పాత్ర గొప్పదన్నారు. రాష్ట్ర అభివృద్ధి, విద్యారంగ అభివృద్ధి పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధనతోనే సాధ్యమవుతుందని, దీని కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులు పాటుపడాలని ఆయన కోరారు. ఉపాధ్యాయుల, ఉద్యోగుల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల ఆర్థిక బిల్లుల మంజూరు, డీఏ పీఆర్‌సీ తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో చర్చలు జరుపుతామన్నారు. కార్యక్రమంలో టీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ అబ్దుల్లా, చందూరి రాజిరెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు అరకల కృష్ణగౌడ్, టీజేఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్, నాయకులు తీనివాసంది ఆల్లె పరమేశ్వర్, సురేందర్, అఫ్సార్ అహ్మద్, షబానా మునావర్, ఇక్బాల్, అహ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..



అంబర్‌పేట నియోజకవర్గం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డిలు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంబర్‌పేట నియోజకవర్గం విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణచారి, సిరిగోజి నరేందర్‌చారి, కోశాధికారి కంది పెంటాచారి, ఉప కోశాధికారి వి.నాగరాజుచారి తదితరులు పాల్గొన్నారు. - (రాంనగర్, ఆంధ్రజ్యోతి)



భోలక్‌పూర్‌లోని బడే మసీద్ వద్ద చాదర్‌ను సమర్పిస్తున్న ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ తదితరులు

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ముషీరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ బడే మసీద్ వద్ద బుధవారం అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్ సమర్పించే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ హాజరై బడే మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వారి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. అర్హు లందరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, మహ్మద్‌కాజా, సిరాజుద్దీన్, రవూఫ్, ముబాషిర్, సహఫాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌చంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి

చిక్కడపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ కె. సుభాష్‌చంద్రారెడ్డి 20వ వర్ధంతి సందర్భంగా చిక్కడపల్లిలోని సిటీసెంట్రల్ లైబ్రరీలో బుధవారం పేద విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సుభాష్‌చంద్రారెడ్డి చిత్రపటానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుభాష్‌చంద్రారెడ్డి కుమారుడు మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ, తన ఆశయాల సాధన కోసం కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగా ప్రతి ఏడాది 20 మంది పేద విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఆర్థిక సాయం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చంద్రతేజరెడ్డి, ప్రణవ్, శివకుమార్‌గౌడ్, రామారావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



పడిపూజకు హాజరైన గౌతమ్‌రావు తదితరులు

వైభవంగా అయ్యప్ప పడిపూజ

బర్కత్‌పుర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ తుల్జాభవన్‌లో బుధవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. జయంతీశ్వరన్ అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు కేజీఎస్‌సీ బోసు గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వాహకులు ప్రదీప్‌నాయుడు గురుస్వామి, లక్కాకుల ప్రవీణ్‌కుమార్ గురుస్వామి, కేవీ యాదగిరి గురుస్వామి నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ నాయకులు కన్నె రమేష్‌యాదవ్, ఎ.సూర్యప్రకాష్‌సింగ్, సి.కృష్ణగౌడ్, ప్రవీణ్‌కుమార్, రామ్, భీమ్‌రాజ్ పాల్గొన్నారు.

ఐదేళ్లైనా పూర్తికాని

కమ్యూనిటీ హాల్

స్లాబ్, గోడలకే పరిమితమైన నిర్మాణం

- నిధుల కొరతతో నిలిచిన పనులు
- కమ్యూనిటీహాల్ అందుబాటులో లేక ఇందిరానగర్ వాసుల అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



ఇందిరానగర్‌లో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు

ముషీరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హాల్ అందుబాటులో లేకపోవడంతో శుభకార్యాలు, సమావేశాలు వంటివి నిర్వహించుకోనేందుకు ఇబ్బందులు పడుతున్నామని భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్థాంతరం నిలిచిపోయిన నిర్మాణ పనులను పూర్తి చేసి కమ్యూనిటీ హాల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందని వారు వాపోతున్నారు. వివరాలు... ఇందిరానగర్ ఫస్ట్ వెంచర్‌లో 2020 ఫిబ్రవరి 15న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, దివంగత మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే ముఠాగోపాల్ శంకుస్థాపన చేశారు.

అసంపూర్తిగా పనులు..

200ల గజాల స్థలంలో రూ.19.10 లక్షలతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు కేవలం స్లాబ్, గోడలకే పరిమితమయ్యాయి. నిధుల కొరత కారణంగా కాంట్రాక్టర్ షాబాద్ ఫ్లోరింగ్, బాత్రూమ్‌లు, కమ్యూనిటీ హాల్ చుట్టూ కంపౌండ్ వాల్ నిర్మాణం, తాగునీటి సదుపాయం, పవర్ బోర్ ఏర్పాటు వంటివి పూర్తి చేయకుండా వదిలేశాడు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని తాము పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించిన స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..

కమ్యూనిటీ హాల్ నిర్మాణ స్థలం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో విద్యుత్ దీపాలు లేకపోవడం వల్ల కొంతమంది ఇక్కడ గంజాయి తాగుతున్నారని, వ్యాపారులు చెక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను ఇక్కడ నిల్వ చేస్తుండటంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని స్థానికులు పేర్కొంటున్నారు.

కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేశాం



కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఇటీవల కలిసి వినతి పత్రం అందజేశాం. ఈ పనులకు రూ.15 లక్షల 26 వేలతో ప్రతిపాదనలు సిద్ధం చేయగా, తన బడ్జెట్ నుంచి నిధులు విడుదల చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నా.

- నందగిరి నర్సింహ, శాంతిభారత్ సేవా సమాజ్ ప్రధాన కార్యదర్శి

నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు



ఇందిరానగర్ ఫస్ట్ వెంచర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చాలా రోజులుగా అసంపూర్తిగా ఉందని స్థానికులు నా దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

- ఎమ్మెల్యే ముఠాగోపాల్

నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం

ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు రూ.22 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

- జీహెచ్ఎంసీ డీఈఈ సన్నీ

వీహెచ్ పోరాటం వల్లే బతుకమ్మకుంటకు మోక్షం

● టీపీసీసీ కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్



మాజీ ఎంపీ హనుమంతరావును సత్కరిస్తున్న లక్ష్మణ్‌యాదవ్ తదితరులు

నల్లకుంట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అంబర్‌పేట నియోజకవర్గంలోని బతుకమ్మకుంటను కబ్జాదారుల నుంచి విముక్తి కల్పించడం మాజీ ఎంపీ వి.హనుమంతరావు (వీహెచ్) వల్లనే సాధ్యమైందని టీపీసీసీ కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్ అన్నారు. బతుకమ్మకుంటపై హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో బుధవారం వీహెచ్‌ను బాగ్‌అంబర్‌పేటలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ నేతలు కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌యాదవ్ మాట్లాడుతూ, బతుకమ్మకుంటకు సంబంధించిన పూర్తి డాక్యుమెంట్లను హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వీహెచ్ అందజేయడం, వాటిని కోర్టులో రెవెన్యూ ఇతర శాఖల అధికారులు ప్రవేశపెట్టార న్నారు. చివరకు హైకోర్టు తీర్పుతో బతుకమ్మకుంటకు కబ్జాదారుల నుంచి మోక్షం లభించిందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పుల్లా నారాయణస్వామి, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తౌలుపునూరి కృష్ణగౌడ్, ధార్మిక్ చందులాల్, పటేల్, పోలినేని రామ్మోహన్‌రావు, తౌలుపునూని నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ. 9 వేలు చెల్లించాలి

● ఈపీఎస్ పెన్షనర్ల రాష్ట్ర సదస్సులో వక్తల డిమాండ్

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పెన్షన్‌పై సీలింగ్ ఎత్తివేయాలని, కరువు భత్యంతో కూడిన కనీస పెన్షన్ ప్రతి నెలా రూ. 9 వేలు చెల్లించే వరకు పోరాటం చేస్తామని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాబోయే కాలంలో కేంద్ర ప్రభుత్వం పెన్షనర్ల విషయంలో అనుసరిస్తున్న విధానాల పట్ల చైతన్యం తీసుకువచ్చి గద్దె దించుతామని వారు హెచ్చరించారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈపీఎస్ పెన్షనర్ల రాష్ట్ర సదస్సు జరిగింది. అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జాతీయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ధర్మజన్, అతుల్ దిగే, నాయకులు బాల్‌రాజ్, భూపాల్, కె.సూర్యం, ఎం.శ్రీనివాస్ తదితరులు హాజరై మాట్లాడారు.

పెన్షనర్ల సమస్య లను పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పీఎఫ్ కార్యాలయంలో హయ్యర్ పెన్షన్ మంజూరులో చేస్తున్న జాప్యాన్ని వ్యతిరేకిస్తూ పీఎఫ్ కార్యాలయాలను ముట్టడిస్తామని వారు హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం. జనార్ధన్‌రెడ్డి, రామారావు, ఎం.కృష్ణారావు, ఎం.నరహరి, ఎన్. బ్రహ్మచారి, జి.అశోక్, శంకర్‌రావు, కె.వైకుంఠరావు పాల్గొన్నారు.

పాఠశాలల వద్ద స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

● డీఎంసీ మారుతీదివాకర్

బర్కత్‌పుర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అన్ని పాఠశాలల వద్ద స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేస్తున్నట్లు అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతీదివాకర్ తెలిపారు. బుధవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవితో కలిసి నింబోలిఅడ్డ నుంచి కుమార్ థియేటర్ వరకు రోడ్డును పరిశీలించారు. అదే విధంగా బస్తీల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబర్‌పేట సర్కిల్ పరిధిలో పాఠశాలలు ఉన్న ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కన్నె రమేష్ యాదవ్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, జీహెచ్ఎంసీ ఈఈ రమేష్, డీఈ సంజయ్, ఏఈ ప్రశాంత్ నాయకులు సుభాష్‌పటేల్, భీమ్‌రాజ్, సంతోష్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రాకర్ హత్య పత్రికా స్వేచ్ఛకు గొడ్డలి పెట్టు

● పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.లక్ష్మణ్ గడ్డం

నల్లకుంట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో జర్నలిస్టు ముఖేష్ చంద్రాకర్ హత్య పత్రికా స్వేచ్ఛకు గొడ్డలి పెట్టువంటిదని పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం అన్నారు. చంద్రాకర్‌ను హత్య చేసిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, ఈ హత్యకు ఆ రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతికా స్వేచ్ఛ పరంగా ప్రపంచ వ్యాప్తంగా భారత దేశ ప్రతిష్ట దిగజారిపోతున్నదన్నారు. పత్రికా రంగం అంటే ప్రభుత్వాలు భయపడుతున్నాయన్నారు. తెలంగాణలో గత డిసెంబర్ 29న పుస్తక ప్రదర్శనలో వీక్షణం సంపాదకుడు వేణుపై మతతత్వవాదులు దాడులు చేశాయని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టు రక్షణ చట్టం తీసుకురావాలని కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, నాయకులు కొండయ్య, అంజనేయులు పాల్గొన్నారు



ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఈఓ లక్ష్మారెడ్డి తదితరులు

వీరాంజనేయ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అడిక్‌మెట్‌లోని శ్రీవీరాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తామని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం వీరాంజనేయ స్వామి అయన నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆలయ ఈఓ లక్ష్మారెడ్డి, ఇన్‌స్పెక్టర్ అండాళ్ ఆధ్వర్యంలో జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్‌గా ట్రస్ట్ వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు పిట్టల ప్రభాకర్‌రావు, ధర్మకర్తలుగా రాజ్‌కుమార్, సందీప్, స్వాతివర్మ, స్నేహలత, కోదండపాణి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి అనిల్‌కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు కృష్ణమాచారి, శ్రీదర్‌చారి, మాజీ చైర్మన్ మధుసూదన్‌రావు, కాంగ్రెస్ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు తిరుమల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజియాదవ్, నాయకులు యాదగిరి, ప్రకాష్, రాములు పాల్గొన్నారు.

గ్రావిటీ లైన్ పనులు త్వరగా పూర్తి చేయండి

● జలమండలి ఎండీని కోరిన కార్పొరేటర్ రవిచారి

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్ రిసాలగడ్డలో రూ. 38 లక్షల వ్యయంతో రెండేళ్ల క్రితం చేపట్టిన గ్రావిటీ లైన్ పనులు నిలిచిపోయాయని స్థానికుల ఫిర్యాదు చేయడంతో స్థానిక కార్పొరేటర్ కె.రవిచారి ఆ ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. జలమండలి ఎండీ అశోక్‌రెడ్డితో మాట్లాడి ఈ పనులను త్వరగా పూర్తి చేసి రాంనగర్‌లోని బాకారం, శివస్థాన్‌పూర్, రిసాలగడ్డ ప్రజలకు మంచినీరు అందించాలని కోరారు. గ్రావిటీ లైన్ పనులను త్వరలో పూర్తి చేస్తామని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం మోహన్‌రాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అకస్మాత్తుగా కూలిపడిన దత్తాత్రేయ పాత ఇంటి ప్రహరీ

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాంనగర్‌లోని టీఆర్‌టీ క్వార్టర్స్‌లో గల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పాత ఇంటి ప్రహరీ కూలి పక్కనే ఉన్న ఇంటివైపు పడింది. దీంతో ఆ ఇంటిలోని చెట్లు విరిగిపోగా, కుండీలు, ఇంటి సజ్జ దెబ్బతిన్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. టీఆర్‌టీ క్వార్టర్స్‌లో దత్తాత్రేయకు చెందిన పాత ఇంటిని కూల్చివేసి కొత్త నిర్మాణం కోసం పనులు చేపట్టారు. కాగా బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా ఆ ఇంటి ప్రహరీ కూలి పక్కనే ఉన్న కె.సుధాకర్ ఇంటి వైపు పడింది. దీంతో ఆ ఇంటి సజ్జ కూలింది. ఆ ఇంట్లోని చెట్లకొమ్మలు విరిగిపడగా, పూలకుండీలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటన జరిగిన సమయంలో ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన జరగడం బాధాకరమని, తమ ఇంటి ప్రహరీగోడ కూలి పక్కింటి వ్యక్తికి జరిగిన నష్టంపై తగిన పరిహారం అందిస్తామని దత్తాత్రేయ కుటుంబ సభ్యులు తెలిపారు.



తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్‌ను విష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, సంఘం నేత ఆశయ్య తదితరులు

రజక వృత్తిదారులకు అధునాతన లాండ్రీలు

● మంత్రి పొన్నం ప్రభాకర్

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని రజక వృత్తిదారుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రంలోని మండలాలు, పట్టణాల్లోని రజక వృత్తిదారులకు అధునాతన లాండ్రీలు అందిస్తామని హామీ ఇచ్చారు. బుధవారం నగరంలోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించి మాట్లాడారు. రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ, రజక వృత్తిదారులకు సంబంధించిన ఉచిత వి ద్యుత్ పథకం బకాయిలు చెల్లించాలని, విద్యుత్ అధికారుల వేధింపులు ఆపాలని, రాబోయే బడ్జెట్‌లో రజకవృత్తిదారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాల న్నారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి రాజు నరేష్, ఉపాధ్యక్షుడు మల్లేష్, సహాయ కార్యదర్శి గోపాల్ పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానం



అసెంబ్లీ స్పీకర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ ఈఓ అన్నపూర్ణ

చిక్కడపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగే వైకుంఠ ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు ప్రముఖులను ఆహ్వానించినట్లు ఆలయ ఈఓ అన్నపూర్ణ తెలిపారు. బుధవారం సాయంత్రం ఆమె ఆలయంలో విలేకరులతో మాట్లాడుతూ, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆహ్వానపత్రికలు అందజేశామన్నారు.

ఇళ్ల కోసం డబ్బులడిగితే ఫిర్యాదు చేయండి

● ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ మోహీనుద్దీన్

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే తమకు ఫిర్యాదు చేయాలని జీహెచ్ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ మహ్మద్ ఖాదర్ మోహీనుద్దీన్ బుధవారం విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా ఇంటింటికీ సర్వే కోసం వచ్చే సర్వేయర్లు, సిబ్బంది డబ్బులు అడిగితే ఇవ్వొద్దన్నారు. జీహెచ్ఎంసీ సిబ్బంది ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఫోన్ నంబర్ 8125967208కు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

26న 'సెయింట్ పాల్స్' పూర్వవిద్యార్థుల సమావేశం

చిక్కడపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హిమాయత్‌నగర్‌లోని సెయింట్ పాల్స్ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం ఈనెల 26న సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు సెయింట్ పాల్స్ అలుమ్ని అసోసియేషన్ కార్యవర్గసభ్యులు వివేకానంద్ తెలిపారు. 1974 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు 100 మంది వరకు ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు. దేశవిదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు ఈ సమావేశానికి హాజరవుతారని అన్నారు.

నల్లకుంట కార్పొరేటర్ హౌస్ అరెస్ట్



బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నాయకుల దాడి నేపథ్యంలో బుధవారం నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృతను హౌస్ అరెస్ట్ చేసిన స్థానిక పోలీసులు.

- (నల్లకుంట, ఆంధ్రజ్యోతి)

స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించాలి

చిక్కడపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలు చేస్తున్న స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించాలని గాయని హైమవతి భీమన్న అన్నారు. తెలంగాణ స్త్రీసేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం అశోక్‌నగర్ వెల్ఫేర్ సెంటర్‌లో లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా హైమావతి భీమన్న మాట్లాడుతూ, స్త్రీసేవా సంస్థ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా రెండు కాళ్లు లేని విజయ్ అనే విద్యార్థికి సంస్థ అధ్యక్షురాలు గురజాడ శోభాపేరిందేవి జైపూర్ కృత్రిమ కాళ్లు అందజేశారు. కార్యక్రమంలో బిల్లా మహేందర్, శ్రీదేవి, శైలజ, హేమలత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

క్విడ్‌ప్రో కో ద్వారా సీఎం దోపిడీ: బక్క జడ్సన్



విలేకరులతో మాట్లాడుతున్న బక్క జడ్సన్

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి క్విడ్‌ప్రో కో ద్వారా వేల కోట్లు తెలంగాణ సంపదను దోచుకుంటున్నారని దివ్యాంగుల సంస్థ మాజీ చైర్మన్ బక్క జడ్సన్ ఆరోపించారు. బుధవారం రాత్రి గోల్కొండ చౌరస్తాలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొడంగల్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లోనే ఈ క్విడ్‌ప్రో కో జరిగిందన్నారు. ఆలిండియా కాంగ్రెస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా 158 కోట్లు ఇచ్చారని ఆరోపించారు. మంత్రి పదవిలో ఉన్న వ్యక్తికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ఎలా అప్పగించారని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత క్విడ్‌ప్రో కో ద్వారా అతిపెద్ద దోపిడీకి రేవంత్‌రెడ్డి తెరతీశారన్నారు. దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాజెక్టులు నిర్మించే ఎల్ అండ్ టీని కాదని రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు కొడంగల్ ప్రాజెక్ట్‌ను ఎందుకు ఇచ్చారని అన్నారు. ఈ విషయంపై క్రిమినల్ కేసులు వేస్తామని, హోంశాఖ మీ వద్దే ఉంది కాబట్టి చిత్తశుద్ధి ఉంటే విచారణ చేయించాలని రేవంత్‌రెడ్డికి ఆయన సవాల్ విసిరారు. తెలంగాణలో జరుగుతున్న ఈ ఆర్థిక దోపిడీ పై సుప్రీంకోర్టుకు వెళ్తామని, సెంట్రల్ విజిలెన్స్‌కు, రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామని బక్క జడ్సన్ అన్నారు.